క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ సురేష్

రొళ్ల: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెడతామని మడకశిర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అక్రమ మద్యం, గుట్కా రవాణాపై నిఘా పెట్టాలని సిబ్బందికి సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో గొడవలు, ఘర్షణలు, దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు వంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మధురామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.ర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

రొళ్ల: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ ఆజాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆజాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ కృషి యోజన (డీడీయూజీకేవై) పథకంలో భాగంగా జాబ్ కార్డు కలిగి ఉండి వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల్లో 18 ఏళ్ల నుంచి 25 ఏళ్లలోపు వయస్సున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయిన వారితో పాటు డిగ్రీ పూర్తి చేసుకుని ఇంట్లో ఖాళీగా ఉన్న నిరుద్యోగులకు మూడు నెలల పాటు అనంతపురం, కంబదూరు రెండు సెంటర్లలో ప్రత్యేకంగా టూరిజమ్, హోటల్ మేనేజ్‌మెంట్, రీటైలర్ సూపర్‌వైజర్, వెబ్ డెవలోపర్, ఎలక్ట్రీషియన్ తదితర వాటిపై శిక్షణ ఇవ్వడంతో పాటు భోజనం, వసతి సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. తర్వాత శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. అర్హులైన వారు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

చిలమత్తూరు: మండలంలోని రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ పేర్కొన్నారు. మండలంలో నూతనంగా రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు పట్టాదారు పాసు పుస్తకం 1బీబీబీ, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్ ప్రతులను తమ పరిధిలోని భరోసా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకూ లబ్ధి పొందిన రైతులు కొత్తగా నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని నూతనంగా రిజిస్ట్రేషన్లు చేసుకునే రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా గంధం వేడుక



గంధం మోసుకెళ్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణ సమీపంలోని పవిత్ర హజ్రత్ సయ్యద్‌షా బెహలూల్‌షా ఖాద్రీ షహీద్ 826వ గంధం వేడుకలు దర్గాలో బుధవారం తెల్లవారుజామున ఘనంగా జరిగాయి. దర్గా పీఠాధిపతి ఆదోని షేక్షావలి ఆధ్వర్యంలో భక్తుల కోలాహలం మధ్య ఇంటి నుంచి గంధం తీసుకువచ్చి స్వామి సమాధికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆనందమని 'పింఛన్'

- నూతన పింఛన్లు పంపిణీ చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



పరిగి: నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



హిందూపురం: కొత్త పింఛన్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్లు మంజూరు చేస్తున్నారని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త టీఎన్.దీపిక అన్నారు. బుధవారం హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన 1293 మందికి కొత్తపింఛన్లు అందించారు. పట్టణంలోని ప్రతి వార్డులో పండుగలా కొత్త పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డిలతో పాటు కౌన్సిలర్లు మంజూరైన కొత్త పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. హిందూపురం మున్సిపాలిటీలో పరిధిలో 855, హిందూపురం మండలంలో 221, చిలమత్తూరులో 217, లేపాక్షి మండలంలో 146 మందికి నూతన పింఛన్లను అందజేశారు.

పెనుకొండ రూరల్: నూతనంగా ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లను రాంపురం, గుట్టూరు, దుద్దేబండ పంచాయతీల్లో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామ్మోహరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నిర్మల, నారాయణస్వామి, ఆంజనేయులు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద 1, 2, 3 సచివాయాల పరిధిలోని 80 మందికి నూతన పింఛన్లు మంజూరయ్యాయి. ఇందులో భాగంగానే లబ్ధిదారులకు బుధవారం ఎంపీపీ చంద్రశేఖర్ చేతుల మీదుగా కొత్త పింఛన్లు అందజేశారు. ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ , సర్పంచ్ రూప, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చంద్రశేఖర్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలానికి 325 నూతన పింఛన్లు మంజూరు కాగా బుధవారం ఆయా గ్రామ సచివాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు ఆదినారాయణ, వసుంధర, రత్నమ్మ, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, నీలావతితో పాటు పంచాయితీ కార్యదర్శులు చేతులు మీదుగా పింఛన్ అందించారు.

చిలమత్తూరు: మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన 217 నూతన పింఛన్లు నాయా గ్రామాల్లోని పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తెలిపారు. కోడూరులో 80 నూతన పింఛన్లను సర్పంచ్ మురళీ మోహన్, సింగిల్ విండో చైర్మన్ హనుమంతరెడ్డి, ఎంపీటీసీలు మంజునాథ్‌రెడ్డి, ఆదినారాయణ, బాబూ ప్రసాద్, అధికారులు పంపిణీ చేశారు.

రొళ్ల: మండల పరిధిలోని గుడ్డగుర్కి సచివాలయం పరిధిలో 32 నూతన పింఛన్లు మంజూరు కాగా బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచ్ హరిక్రిష్ణ, ఎంపీటీసీ లింగరాజు, వైస్ సర్పంచ్ గౌడప్ప, సచివాలయం కన్వీనర్ బండెప్ప తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండ రూరల్: రాంపురంలో ఫించన్‌లు అందచేస్తున్న దృశ్యం



రొద్దం: కొత్త పింఛన్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



లేపాక్షి: కల్లూరులో కొత్త ఫించన్లు అందుకున్న లబ్ధిదారులు



చిలమత్తూరు: కోడూరులో నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం



రొళ్ల: గుడ్డగుర్కిలో కొత్తగా పింఛన్ పంపిణీ చేస్తున్న నాయకులు

పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే శంకరనారాయణ

పరిగి: ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం పరిగి, కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలో మంజూరైన నూతన పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ పరిగి మండలంలో 478 మందికి వైఎస్సార్ పింఛన్ కానుక పథకం ద్వారా ప్రభుత్వం పింఛన్లను మంజూరు చేసిందన్నారు. వచ్చే జనవరి నుంచి పింఛన్‌ను రూ.3 వేలకు పెంచుతున్నారని తెలిపారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చెబితేనే పింఛన్ వచ్చే దుస్థితి ఉండేదన్నారు. ఏ పథకం కావాలన్నా నాయకులకు లంచం ముట్టజెప్పనిదే లబ్ధిదారులకు న్యాయం జరిగేదికాదన్నారు.

30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఈనెల 30 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. ఎంపీపీ సవిత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, కాణిపాకం ఆలయ ట్రస్టు డైరెక్టర్ మారుతీస్వామి, జెడ్పీటీసీ శ్రీరామప్ప, మాజీ కన్వీనర్ జయరాం, వైస్ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీలు చంద్రారెడ్డి, రామాంజి, మారుతీరెడ్డి, చిక్కన్న,కోఆప్షన్ మెంబర్ సలీం, ఎస్సీ సెల్ నాయకులు శివ, శంకర్, మాజీ ఎంపీపీ గోవిందప్ప, మాజీ సర్పంచ్ వెంకటేశులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం

- ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోండి
- ఎమ్మెల్యే తిప్పేస్వామి



విత్తన కిట్లను రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: 'రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. రైతులందరూ ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోండి' అని ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు తిప్పేస్వామి అన్నారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు పీఎంఏజేఏవై పథకం కింద ఉచితంగా వివిధ రకాల చిరు ధాన్యాల విత్తనం కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 754 మంది ఎస్సీ రైతులకు కిట్లను అందజేశారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ అన్ని వర్గాల రైతులను ప్రకృతి వ్యవసాయం చేసుకునే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని స్పష్టం చేశారు. ఎస్సీ రైతులను ప్రోత్సహించడానికి వీలుగా విత్తనాలను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందన్నారు. ప్రతి ఒక్కరూ కూడా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని కోరారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. జిల్లాలో 1,772 మంది ఎస్సీ రైతులకు విత్తన కిట్లు మంజూరయ్యాయని, ఇందులో మడకశిర నియోజకవర్గానికి చెందిన 754 మంది ఎస్సీ రైతులకు కిట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారని వివరించారు. రైతులందరూ ముఖ్యమంత్రికి అండగా ఉండాలని కోరారు. మడకశిర నియోజకవర్గానికి అక్టోబర్ 16న కృష్ణా జలాలను విడుదల చేస్తారని తెలిపారు. అన్ని చెరువులను కృష్ణా జలాలతో నింపడమే ధ్యేయమన్నారు.

ఇది రైతు ప్రభుత్వం

జిల్లా అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో రైతుల ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందన్నారు. రైతులు నష్టం పోకుండా ఉండేందుకే ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. సమావేశంలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య, అధికారులు శంకరయ్య, సాల్మన్‌రాజు, ఎంపీడీఓ సోనిబాయి, ఏడీఏ కృష్ణమీనన్, పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సరోజమ్మ, ఎంపీపీ కవిత, వైస్ ఎంపీపీ మూర్తి, మాజీ ఎంపీపీ బజ్జప్ప, తదితరులు పాల్గొన్నారు.

'నవరత్నాలు' దేశానికే ఆదర్శం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేసిన నవరత్నాల పథకాలు దేశానికే ఆదర్శమని హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. హిందూపురం పట్టణంలోని 10వవార్డు కౌన్సిలర్ పార్వతీ ఆధ్వర్యంలో ఎన్‌జీఓ కాలనీ, కృష్ణలేవుట్ ప్రాంతాల్లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల దీవెనతోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందనీ, మీకు సేవ చేయడమే తమ లక్ష్యమన్నారు. తాము పాలకులం కాదు సేవకులమని, సదా మీసేవలో ఉంటామన్నారు. టీడీపీ తప్పుడు ప్రచారాలు, అబద్ధాలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జబీవుల్లా, మున్సిపల్ కౌన్సిలర్లు షాజియా, మణి, గిరి, రామచంద్ర, మల్లికార్జున, జయప్ప, మండల కన్వీనర్ శ్రీరాంరెడ్డి, మహిళా కన్వీనర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు



రొద్దం: లాంగ్ జంప్ చేస్తున్న విద్యార్థి

హిందూపురంటౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హిందూపురంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీలను ఎంఈఓ-1 గంగప్ప ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం సామ్రాజ్యం, జిల్లా పీడీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, పీడీలు లోక్‌నాథ్, విలియం శేఖర్, రాణి, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం హెచ్ఎం పద్మజ సమక్షంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు డివిజన్‌స్థాయికి ఎంపికైనట్లు పీడీ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్, పీడీ రామకృష్ణ, పీడీలు శ్రీదేవి, బాలాజీనాయక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: లేపాక్షిలోని నీలం సంజీవరెడ్డి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 8 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్ తదితర పోటీలు నిర్వహించారు. 16న హిందూపురం పట్టణంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాల నియోజకవర్గస్థాయి పోటీలు జరుగుతాయని ప్రధానోపాధ్యాయులు వీవీసీ గిరి పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఈఓఆర్డీ బాధ్యతల స్వీకరణ

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఈఓఆర్డీగా నాగముని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు.

వర్క్‌షాప్‌ను విజయవంతం చేయండి

పెనుకొండ: కర్నూలులో ఈ నెల 16, 17 తేదీల్లో జరిగే ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ రాష్ట్ర వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పెడబల్లి బాబా పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో ఆటో కార్మికులతో కలసి కరపత్రాలు విడుదల చేశారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

అగళి: స్థానిక ఎంపీడీఓగా ఆర్.రవిప్రసాద్ బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేందుకు కృషి చేస్తామన్నారు.

పశువుల స్వాధీనం

చిలమత్తూరు: మండలంలోని 544ఈ జాతీయ రహదారి తమ్ములకుంట క్రాస్‌లో అక్రమంగా అశోక్ లేల్యాండ్ వాహనంలో తరలిస్తున్న ఏడు పశువులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వాహన డ్రైవర్ పరారైనట్లు చెప్పారు. పశువులను గోశాలకు తరలించి, వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న రమణారెడ్డి

లేపాక్షి: హిందూపురం వ్యవసాయ డివిజన్ వ్యాప్తంగా మంజూరైన రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఏ.రమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఐదు మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ అల్తాఫ్‌అలీఖాన్, డీఈ హరిప్రసాద్, ఏఓ శ్రీలత, చిలమత్తూరు, పరిగి, హిందూపురం, గోరంట్ల మండలాల సలహా మండలి అధ్యక్షులు గోవిందరెడ్డి, రామక్రిష్టారెడ్డి, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

అమరాపురం: మండలంలో ఈ నెల 30 నుంచి చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ఈరన్న, ఎంపీడీఓ మునిస్వామి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయం కార్యదర్శులు, ఎంఎల్‌హెచ్‌పీఓలు, ఏఎస్ఎంలు, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలిచ్చారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి

పావగడ: తాలూకాలోని నాగలమడక గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కృష్ణుని చిత్రపటాన్ని వెండి రథంపై గ్రామంలో ఊరేగించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

మహిళా సంఘాల లావాదేవీలపై ఆడిట్

అమరాపురం: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం మహిళా సంఘాల లావాదేవిలపై ఎల్సీ విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆడిటింగ్ నిర్వహించారు. రుణాలు, రికవరీ తదితర వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

కార్మికులకు న్యాయం చేయండి

హిందూపురం టౌన్: మండల పరిధిలో తూమకుంట పారిశ్రామిక వాడలోని గురునానక్ ఫ్యాక్టరీ కార్మికులకు న్యాయం చేయాలని తూమకుంట పారిశ్రామికవాడ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్మికశాఖ ఏఎల్ఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు సన్మానం

అగళి: బదిలీపై వెళ్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నరేంద్రకుమార్‌ను ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛాలు, శాలువాలు వేసి సత్కరించారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

మడకశిరరూరల్: మండల పరిధిలోని టీడీపల్లి కొండపై వెలిసిన రంగనాథస్వామి దేవాలయానికి సీసీ రోడ్డు నిర్మాణానికి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజగౌడ్ భూమి పూజ పనులను ప్రారంభించారు.

గుట్టూరులో ఉచిత వైద్య శిబిరం

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టురు గ్రామంలో జెడ్పీటీసీ శ్రీరాములు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కిమ్స్ సవీర ఆస్పత్రి వైద్యులు దాదాపుగా 200 మందికి పరీక్షలు నిర్వహించారు.

ఈయూ నాయకుల హర్షం



మడకశిర: డిపో ఎదుట హర్షం వ్యక్తం చేస్తున్న ఈయూ నాయకులు

మడకశిర: ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ఈయూ (ఎంప్లాయిస్ యూనియన్)ను అతి పెద్ద గుర్తింపు సంఘంగా గుర్తించినందుకు బుధవారం ఆ యూనియన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే మడకశిర డిపోఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు.

15న గడప గడపకూ మన ప్రభుత్వం

గుడిబండ: ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గుడిబండ, కుగీరనపాళ్యంలో 15న, మోపురుగుండు, సింగేపల్లి, ఎస్ఆర్ హట్టి గ్రామాల్లో 16వ తేదీ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



రాఘవేంద్ర స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో గురు రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామి చిత్రపటాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. మహిళలు భజనలు చేశారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

రొద్దం: మండలంలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీపీ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీ చాంబర్‌లో ఇళ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించి సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.